ఈ పద్ధతులూ ఇంకా నీకు తోచిన ఇతరములైన పద్ధతులూ అవలంబించి ఎంతకాలం తోసి వేయ గలిగితే అంతకాలం తోసివేసి తప్పించుకొని తిరగాలి. ఈ విష యంలో మార్గేతరములను గూర్చి నేను ఎక్కువగా చెప్ప వలసిన అవసరము లేదు. ఎందుకంటే అనుభవము మీాద నీకే తెలుస్తవి ఈ మెళకువలన్నీ.

ఇలాగ కొన్నాళ్లు గడిచిపోతవి. కాలం గడిచిన కొద్దీ అప్పు ఇచ్చినవాళ్లు, నిన్ను కలుసుకొని అడగ టానికి చేసిన ప్రయత్నాలు విఫలమైపోగా విసుగెత్తి, ఆ ప్రయత్నాలను విరమిస్తారు. ఆ విధంగా కొన్ని అప్పులు ఈ స్టేజి లోనే తీరిపోతవి.

కొంచెం పెద్ద మొత్తం ఇచ్చినవాళ్ళు, ఆ స్థితిలో విరమించుకోక, వెంటబడి కనపడినప్పుడల్లా అడుగు తుంటారు అప్పుడు తప్పించుకు తిరగడము అనే ప్రకర ణము మాని ఇంకో పద్ధతిలోకి మనము దిగవలసి ఉంటుంది. ఆ విధానాన్ని తరువాత ప్రకరణలో వివ రిస్తాను.

## 7. ఋణదాతను రైలెక్కించటం

అప్పులు తీర్చేపద్ధతులలో రెండో విధానాన్ని గురించి ఈ ప్రకరణంలో చెపుతాను.

ఋణదాతను తప్పించుకు తిరగడము మొదటి మార్గము అని చెప్పినాను. మరీ వెంటబడి తిరిగేవాళ్ల

విషయంలో ఇప్పుడు చెప్పబోయే పద్ధతి అనుసరించ వలసి ఉంటుంది.

అటువంటివాళ్ళతో ఇల్లా అనాలి: "ఏమిటయ్యా, ఎక్కడబడితే అక్కడ పట్టుకొని అడుగుతావు. సమయం అసమయం అంటూ లేదా ఏమిటి? తొందరపడితే మటుకు ఎక్కడనుంచి అయినా పుట్టుకొస్తుందా సామ్మ్? నాకు ఇవ్వాలిసిన వాళ్ళు ఇయ్యాలా! నా చేతిలోకి డబ్బు రావడంతోనే ముందు నీ కిచ్చి మరో విషయం చూచుకొంటాను. సరేనా! ఇంకేమయ్యా! ఇంకా నీకు భయమెందుకూ!" ముందు మనకే ఇస్తానన్నాడు కదా అని ఆయన సంతోషిస్తాడు.

ఈ విధంగా డబాయింపులో మనిషిని అదర గొడుతూ, కొంతకాలం గడపవలసి ఉంటుంది. అప్పటికీ వదలక విసుగు లేకుండా అడుగుతూఉంటే, వాళ్ళను కొంచెం కఠినంగా కోప్పడవలసిన అవసరము నీకు కలుగు తుంది.

ఆ స్థితి వచ్చిన తరువాత ఆ మనిషి కనపడడము తోనే నీవే ముందుగా కస్సుమంటూ లేచి, భయంకర మైన చూపులు చూస్తూ, "ఛా, ఏ పాడుఘడియలో నిద్ర లేచినానో కాని, ఎక్కడికి వెళ్ళినా ఏదో దరిద్రపు మొఖం కనబడుతూనే ఉంటుంది" అని అన్యాపదేశంగా అను, ఆ మనిషిని చూస్తూ.

అప్పటికీ గ్రహింపు లేక అతడు అడిగినాడో భగ్గున మండిపడి, ఎవరిమీదనో ఎందుకో కోపం వచ్చిన వాడిలాగ నటించవలె.

అంటే నీకు ఇవ్వవలసిన వాడు ఎవడో ఇస్తానని ఇవ్వనట్లూ, అతనివలననే నీకు ఇంత అప్రదిష్ఠ వచ్చినట్లూ వెల్లడిచేస్తూ, ఎక్కడో ఉన్న ఆ వ్యక్తిని పట్టుకొని నానా మాటలు అను.

"అవునయ్యా, నీ తప్పేముంది. నీకు ఇవ్వాలి కాబట్టి అడుగుతావు. నేను, నాకు ఇవ్వవలసిన వాళ్ళను ఈ విధంగా అడగలేనాయె చచ్చి! అందుకనే నాగతి యిట్లా అయింది. నాకివ్వాలసిన గాడిదలు... ఇచ్చి చావరాయె! ప్రతి వెధవకూ చులకనై పోతిని"

ఈ విధంగా ఎగిరిపడితే ఆ కేకలు విని, భయపడి, ఆ ఋణదాత వెళ్ళిపోవడము సహజము. ఇల్లాగ ఎగిరి పడి కసరికొట్టి ఋణదాతలను వదిలించుకోవడం అప్పులు తీర్చే మార్గాలలో మూడవదని గ్రహించవలయును.

ఇక ఋణదాతలను కోర్టుకు వెళ్లే లాగున చేయడము న్యాయంగా అప్పుతీర్చే మార్గాలలో నాల్గవది అని గ్రహించవలసి ఉన్నది. ఇంత వ్యవహారం జరిగిన తరువాత పెద్దమొత్తాలు అప్పు ఇచ్చినవాళ్ళు కోర్టుకు పెడతారు. అంతకంటే ఇంకో మార్గము లేదు వాళ్ళకు.

వాళ్ళు కోర్టుకు వెడతారని నీవు ఏమీ భయపడకు. సమనులు వచ్చినా చూడకుండా విసిరి పారెయ్యి. కోర్టుకు వెళ్ళిందాకా నీకేం కర్మం! నీవు అసలు వెళ్ళనే వద్దు.

నీవు కోర్టుకు వెళ్ళకపోతే ఎక్సుపార్టీ డిక్రీ అవుతుంది. అయితే కానియ్యి. నీకువచ్చిన ఇబ్బంది ఏముంది !

డిక్రీ అయిందో ఇక నీవు బ్రతికి బైట పడ్డట్లే! డిక్రీ అయిన తరువాత నీవు ధైర్యంగా అన్ని వీధులలోనూ తల ఎత్తుకొని తిరుగవచ్చు. ఎందుకంటే వాడు నిన్ను ఇక ఏ ముఖం పెట్టుకొని అడుగుతాడు! అసలు అడగవలసిన అవసరం ఏముంది! పోతే ఆస్తి మీదక్కు పోవాలె. అంతేగా! పోనియ్యి.

"పోవయ్యా, డిక్రీ పొందావుగా! ఆ బోదన్ పొలాలు జప్తుచేయించుకో." అని నీవే అంటూ ఉండు. ఆ బోదన్ పోవడము సాధారణంగా జరగదు. పోయినా అక్కడ మనకు ఏమీ లేదన్న సంగతి తెలియడానికి చాలా కాలము పడుతుంది.

ఒకరు డిక్రీ పొందినట్లు తెలియడము తోనే అందరూ కోర్టుకు ఎక్కుతారు. అదే మనకు క్షేమం. అందరినీ ఒకేసారి నైజాం రైలు ఎక్కించవచ్చు. వాళ్లు రైలు ఎక్కుతున్నపుడు నీ పొలాలు అన్యాయంగా

కాజేయడానికి వాళ్ళంతా వెదుతున్నట్లు కొంచెంగా బాధ పడు.

అయితే నువ్వు, వాళ్ళతో మర్యాదగా మాట్లాడి ఎక్కడ రైలు మారాలిసిందీ. ఏ హోటలులో బసచేస్తే సౌఖ్యంగా ఉండేదీ అన్నీ వివరంగా చెప్పి అనివార్యమైన విపత్తును ధైర్యంతోనూ ఉత్సాహంతోనూ ఎదుర్కొంటున్న వాడి లాగ నటించు.

దానితోనీ అప్పులన్నీ సక్రమమైన మార్గంలో తీరినట్లు నీవు భావించవచ్చు.

ఆ తరువాత ఆ వూళ్లో ఉండవలసిన అవసరమూ లేదు ప్రయోజనమూ లేదు. కావలసిన పని అంతా అయిపోయింది. తరువాత ఎక్కడికైనా వెళ్ళిపోవడము విషయమై గట్టిగా ఆలోచించు. మద్రాసు మన రాష్ట్రం కాదు కాబట్టి అక్కడకు వెళ్ళడము అన్నివిధాలా మంచిది. ఇప్పుడు అక్కడ ఇళ్లు చౌకగా కూడా దొరుకుతున్నవి.

ఈ అప్పుల మూలంగా లభించిన సొమ్ము మాత్రం జాగ్రత్తగా దాచిపెట్టుకో. ఆడదాని సొమ్ము జోలికి ఎవ్వరూ పోరు కాబట్టి మీ యింటి ఆవిడకు నాలుగు సరుకులు చేయించి పారెయ్యి, శాశ్వతంగా ఉంటవి.

ఇంతవరకూ పెద్దపెద్ద మొత్తాలు అప్పుగా తెచ్చే విధానాలూ, అవి తీర్చడానికి అవలంబింప వలసిన

మార్గాలూ వివరించాను. తరువాత ప్రకరణంలో చిన్న మొత్తాలు అప్పులుగా తెచ్చే విధానములను గురించీ అవి తీర్చడానికి అవలంబింప వలసిన మార్గాలనుగురించీ కొన్ని రహస్యాలు చెప్పదలచుకొన్నాను.

## 7. చిన్న అప్పుల పైసలా

కొద్ది జీతగాళ్లు, అనగా యాభయ్యో, అర వయ్యో జీతం పుచ్చుకొనేవాళ్లు, పైన సూచించిన విధంగా పెద్ద పెద్ద అప్పులు పుట్టించ లేరు. అటువంటి వాళ్ళు ఎల్లాగ బ్రతకవలె నన్నది ప్రకృత విషయము. వాళ్ళు సుఖంగా బ్రతకవలె నంటే కొన్ని అప్పులు చేయకా తప్పదు, వాటిని న్యాయంగా తీర్చకా తప్పదు. ఆ విషయాన్ని గురించే ఈ ప్రకరణంలో ముచ్చటిస్తాను.

చిన్న అప్పులు చేసే వాళ్లు కూడా పెద్ద అప్పులు చేసే వాళ్ళు అవలంబించిన పద్ధతులనే అవలంబించ వలసి ఉంటుంది. దండయాత్ర సాగించే పద్ధతులు కూడా అవే!

ఈ రకం మనుష్యులు పదీ ఇరవై అప్పు పుచ్చు కొంటూ ఉంటారు. ఇక్కడ కూడా ఓ చిన్న ధర్మ శాస్త్రం ఉన్నది. పది రూపాయలు అప్పు కావలసి వస్తే యాభై అడగడము మంచిది. అంత పెద్ద మొత్తం అడిగిన తరువాత, నీకు పదో పదిహేనో విదిల్చి నిన్ను వదలించు